ఈనాడు
నాగర్‌కర్నూల్
సోమవారం అక్టోబరు 7, 2024

మూడో వారంలో

కొనుగోలు కేంద్రాలు

- పాలమూరులో 28 చోట్ల ఏర్పాటుకు చర్యలు
- క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర





సీసీఐ డీజీఎం మహేశ్వర్‌రెడ్డితో ముఖాముఖి

ఈనాడు, మహబూబ్‌నగర్: భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయించే రైతులు ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాను తీసుకు రావాలని సీసీఐ మహబూబ్‌నగర్ శాఖ డీజీఎం మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈసారి పత్తి క్వింటాకు రూ. 7,521 మద్దతు ధరను సంస్థ ప్రకటించిందని చెప్పారు. పాలమూరులో మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెల మూడోవారంలో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిన్నింగ్ మిల్లులు, రవాణాకు సంబంధించిన టెండరు ప్రక్రియ కూడా పూర్తి కావొచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై డీజీఎంతో 'ఈనాడు' ముఖాముఖీలో వెల్లడించిన అంశాలిలా ఉన్నాయి.

? **సీసీఐ** ద్వారా విక్రయిస్తే రైతులకు డబ్బులు రావడానికి ఆలస్యమవుతుందని అంటున్నారు?

✔ **సీసీఐ** ద్వారా పత్తి విక్రయించే రైతులకు వారంలోగా డబ్బు ఖాతాలో జమవుతాయి. ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న బ్యాంకు ఖాతాను మాత్రమే రైతు తీసుకురావాలి. కేవైసీ చేసుకోకుంటే డబ్బు రావడంలో సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. కేంద్రాలకొచ్చే సమయంలో రైతు తన ఆధార్‌కార్డు తీసుకురావాలి. రైతు రాలేని పరిస్థితి ఉంటే కుటుంబ సభ్యుడిని పంపించవచ్చు. దీనికి సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర ధ్రువపత్రం తీసుకురావాలి.

? **ఉమ్మడి** జిల్లాలో పత్తి సాగు ఎంత? దిగుబడి ఎంత వస్తుందని అంచనా వేస్తున్నారు?

✔ **ఉమ్మడి** జిల్లాలో మొత్తం 2,43,237 హెక్టార్లలో పత్తి సాగు చేశారు. సుమారు 30 లక్షల క్వింటాళ్ల పత్తి వస్తుందని అంచనా వేస్తున్నాం. వీటి ద్వారా 6.08 లక్షల బేళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది.

? **పత్తికి** మద్దతు ధర ఎలా ఉంది? వర్షానికి పంట దిగుబడి, తేమ శాతంపై ప్రభావం పడింది? రైతుల పరిస్థితి ఏమిటి?


✔ **పత్తికి** సీసీఐ మద్దతు ధర రూ. 7,521గా నిర్ణయించింది. తేమ శాతం 8-12 మధ్యలో ఉండేలా చూసుకోవాలి. తేమ 8 శాతం ఉంటే పూర్తి మద్దతు ధర ఉంటుంది. తేమ శాతంలో తేడా ఉంటే ధరలో స్వల్ప మార్పు ఉంటాయి.

? **రెండేళ్లుగా** రైతులు ప్రైవేటు మార్కెట్‌ను ఆశ్రయిస్తూ నష్టపోతున్నారు? సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు? ఈ సారి అదే పరిస్థితి ఎదురయ్యే అవకాశాలున్నాయా?

✔ **గత** రెండేళ్లు ప్రైవేటు మార్కెట్‌లో క్వింటాకు సీసీఐ మద్దతు ధర కంటే అధికంగా రేటు పలికింది. చాలా మంది రైతులు ప్రైవేటు మార్కెట్‌కు వెళ్లారు. తర్వాత విపణిలో పత్తికి డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గుతూ వచ్చాయి. ఈసారి సీసీఐ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాయి.

? **పత్తి** కొనుగోలు కేంద్రాలెక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారు?

✔ **పాలమూరులో** మొత్తం 28 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. మహబూబ్‌నగర్-2, నాగర్‌కర్నూల్-18, నారాయణపేట-8, వనపర్తి-1, జోగులాంబ గద్వాలలో 1 చొప్పున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. టెండర్లలో పాల్గొన్న జిన్నింగ్ మిల్లులను త్వరలోనే నోటిఫై చేస్తాం. రవాణా కోసం వాహనాల టెండర్ల ప్రక్రియ త్వరలోనే పూర్తికానుంది.



ఉమ్మడి జిల్లాలో పత్తి పంట సాగు వివరాలు ఇలా(హెక్టార్లలో)..

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ. 2,420

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం మొక్కజొన్న క్రయవిక్రయాలు నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ గ్రామాలకు చెందిన 36 మంది రైతులు 563. 50 క్వింటాళ్ల (1,127 బస్తాలు) మొక్కజొన్న అమ్మకానికి తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ. 2,420 మాదిరి ధర రూ. 2,229 కనిష్ఠ ధర రూ. 1,301 వంతున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.



ఉపాధ్యాయ ఖాళీలు మిగలకుండా ఏర్పాట్లు

- మొదట ఎస్‌ఏల భర్తీ ● త్వరలో పాఠశాలలకు కొత్త టీచర్లు



ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. ఈ నెల 1 నుంచి 5 వరకు ధ్రువపత్రాలను పరిశీలన చేయాల్సి ఉండగా మొదటి రోజు సాంకేతిక కారణాలతో ప్రారంభం కాలేదు. మిగిలిన నాలుగు రోజుల్లో ఒక్కో పోస్టుకు 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసే సమయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోకుండా ఖాళీలను భర్తీ చేస్తే మళ్లీ అధిక సంఖ్యలో మిగిలి పోయే అవకాశం ఉంది. ఉపాధ్యాయ పదోన్నతుల సమయంలో ఈ పరిస్థితి ఏర్పడింది. కొందరు అభ్యర్థులు రెండు, మూడు సబ్జెక్టుల్లో అదనపు అర్హతలు సాధించడంతో వారు ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ఎంపికైన వారు వారికి ఆసక్తి ఉన్న ఏదో ఒక పోస్టును ఎన్నుకోవడంతో ఖాళీల ఇబ్బంది ఏర్పడింది. దీంతో మొదటి ఎస్‌ఏ ఖాళీలకు 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి ఏ పోస్టును ఎంపిక చేసుకుంటారన్న విషయంలో ముందుగా డిక్లరేషన్ తీసుకున్నారు. ఎస్‌ఏ ఖాళీలను భర్తీ చేసిన తరువాత ఎస్‌జీటీలో వారు అర్హత సాధిస్తే అవి ఖాళీలుగా మిగిలి పోనున్నాయి. ఆ పోస్టుల్లో తదుపరి ర్యాంకు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి అన్ని ఖాళీలు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో జిల్లాలో 10 నుంచి 25 మంది అభ్యర్థులు రెండు, మూడు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు.

జిల్లా	ఖాళీలు	దరఖాస్తుల పరిశీలన		
		అభ్యర్థులు	హాజరు	గైర్హాజరు
గద్వాల	172	416	387	29
మహబూబ్‌నగర్	243	576	552	24
నాగర్‌కర్నూలు	231	617	575	42
నారాయణపేట	279	664	585	79
వనపర్తి	152	363	341	22

2,440 మంది ధ్రువపత్రాలు పరిశీలన : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు ఉమ్మడి జిల్లాలో 2,440 మంది హాజరయ్యారు. మొత్తం 1,077 ఖాళీల భర్తీకి 2,636 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా 196 మంది గైర్హాజరయ్యారు. ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేటర్లు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో దానికి సంబంధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టలేదు. కోర్టు నిర్ణయం తరువాత ఈ పోస్టుల విషయంలో చర్యలు తీసుకోనున్నారు. ఖాళీల భర్తీతో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

తుది జాబితాల తయారీపై దృష్టి..: ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కావడంతో తుది జాబితా రూపొందించడంపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పాటు వారికి సమాచారం అందజేయనున్నారు. ఎంపికైన వారికి 9న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తి చేశామని త్వరలో తుది జాబితాలను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నాగర్‌కర్నూల్ డీఈవో డా. గోవిందరాజులు తెలిపారు. ఎస్‌ఏల ఖాళీల భర్తీ తరువాత వారు ఎస్‌జీటీలో కూడా ఎంపికైతే పేరు తొలగించి ప్రతిభ ఆధారంగా తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నామన్నారు.

వరమున పుట్టింది సందమామా..



వరలక్ష్మి సందమామా

ఆవంచ వేంకటేశ్వరాలయం ఆవరణలో ఆదివారం ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు, చిన్నారులు.. అనంతరం రాత్రి పొద్దుపోయే వరకు కోలాటాలు, దాండియా ఆడారు.


- న్యూస్‌టుడే, తిమ్మాజిపేట

యువతకు ప్రాధాన్యం: మంత్రి

అలంపూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ప్రాధాన్యం ఇస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం అలంపూర్ హరిత టూరిజంలో విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వకనే నిరుద్యోగ సమస్య పెరిగిందని ఆరోపించారు. తెలంగాణ ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పటిష్ఠం చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. వివిధ శాఖల్లో 60 వేల ఉద్యోగాలను 10 నెలల్లో భర్తీ చేశామని మంత్రి పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించామని, మరో రెండు రోజుల్లో ఉద్యోగ నియామక పత్రాలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేస్తామని మంత్రి వివరించారు. యువతలో నైపుణ్యం పెంచేందుకు ప్రతి జిల్లాలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి పురావస్తు శాఖతో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు మంత్రి ఆలయాలను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో రుద్రహోమం, అభిషేకం, జోగులాంబ ఆలయ సన్నిధిలో చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత దంపతులు, తదితరులున్నారు.



అమ్మవారి దర్శనానికి వస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే విజయుడు తదితరులు



కొల్లాపూర్‌లో కన్యక పరమేశ్వరాలయంలో శాకాంబరి అలంకరణలో అమ్మవారు

- న్యూస్‌టుడే, కొల్లాపూర్

మంత్రి ఆదేశాలతో కదలిక వచ్చేనా!

- ర్యాలంపాడు జలాశయానికి మరమ్మతులు

గద్వాల, న్యూస్‌టుడే: నెట్టంపాడు పథకంలో కీలకమైంది ర్యాలంపాడు జలాశయం. లీకేజీలను అరికట్టి పూర్తిస్థాయిలో నీటినిల్వ (4.20 టీఎంసీల) ఉంచటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజాగా గట్టు ఎత్తిపోతల పరిశీలనకు వచ్చిన భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సైతం తక్షణం ర్యాలంపాడు మరమ్మతులకు సంబంధించి కార్యచరణ మొదలు పెట్టాలని ఈఎన్‌సీకి ఆదేశాలు ఇచ్చారు. మట్టి కట్ట నుంచి వస్తున్న లీకేజీల సమస్యపై గతంలో ప్రైవేటు సర్వే సంస్థ జియో ఫిజికల్, ఎలక్ట్రోరెసిస్టివిటీ విధానంలో పరీక్షలు చేసి మట్టి నమూనాలను సేకరించి చేయాల్సిన మరమ్మతులపై సంస్థ సాగునీటి శాఖకు నివేదిక ఇచ్చింది. అందుకు రూ. 153 కోట్ల వరకు ఖర్చు కానున్నట్లు సాగునీటి శాఖ ప్రాథమిక అంచనా. ప్రస్తుతం జలాశయంలో 2 టీఎంసీలు మాత్రమే నిల్వ చేస్తుండటంతో జలాశయం పరిధిలోని 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండేళ్లుగా రబీలో పంట విరామం ప్రకటించాల్సిన పరిస్థితి నెలకొంది.

కర్టెన్ గ్రౌంటింగ్‌కే మొగ్గు: జూరాల జలాశయం మట్టికట్టలో సైతం జలాశయంలో నీటినిల్వ పూర్తి స్థాయిలో చేసిన క్రమంలో 13 ఏళ్ల కిందట సీపేజీలు వచ్చాయి. వాటిని అరికట్టేందుకు మట్టికట్టపై కోర్‌డ్రిల్లింగ్ ప్రక్రియ ద్వారా రంధ్రాలు వేసి గ్రౌంటింగ్ ద్వారా మరమ్మతులు చేపట్టారు. తాజాగా ర్యాలంపాడు జలాశయం మట్టికట్టపై కూడా అదే పద్ధతిలో మరమ్మతులు చేపట్టాలని సాగునీటి శాఖ నిర్ణయించింది. వచ్చే డిసెంబరు నెలలో పనులు మొదలు పెట్టనున్నట్లు ఈఎన్‌సీ మంత్రి పర్యటన సందర్భంగా వెల్లడించారు. అయితే డిసెంబర్‌లో పనులు మొదలు పెట్టాలంటే ఇంకా 60 రోజుల గడువు మాత్రమే ఉంది. ఆర్థిక శాఖ క్లియరెన్స్‌లు, సీవోడీ ద్వారా డిజైన్స్ అప్రూవల్ అయి టెండర్ల ప్రక్రియ చేపట్టి ఒప్పందాలు పూర్తి చేసి పనులు మొదలు పెట్టడానికి కనీసం 50 రోజుల గడువు పడుతుంది. కాబట్టి అధికారులు అక్టోబరు నెలలోనే కార్యాచరణ మొదలు పెడితే కానీ డిసెంబర్‌లో పనులు మొదలయ్యే అవకాశం ఉండదు.

సామర్థ్యం పెంపుపై: గట్టు ఎత్తిపోతల పథకంలో 33 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ పథకం ద్వారానే నీటిని ఎత్తిపోసి సాగునీటిని ఇవ్వాల్సి ఉంటుంది. 4 టీఎంసీల సామర్థ్యం నుంచి 6 టీఎంసీలకు పెంచాలని స్థానిక నేతలు విజ్ఞప్తి చేశారు.

వాస్కోడగామా రైలుకు ఘన స్వాగతం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : సికింద్రాబాద్ - వాస్కోడగామా (గోవా) 07039/40 రైలుకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి జెండా ఊపి ఈ రైలును ప్రారంభించగా మహబూబ్‌నగర్ స్టేషన్‌కు వచ్చింది. స్థానిక సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు, ప్రయాణికులు రైలుకు స్వాగతం పలికారు. ఈనెల 9 నుంచి అధికారికంగా రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్ - వాస్కోడగామా వైపు నడవనుంది. అలాగే తిరుగు ప్రయాణంలో వాస్కోడగామా - సికింద్రాబాద్ ప్రతి గురు, శనివారాల్లో నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.



స్వాగతం పలుకుతున్న రైల్వే సీనియర్ సిటిజన్లు, రైల్వే అధికారులు

గింజను కొలిచి.. బోనస్ ఇస్తారట!

- కొత్త నిబంధన తేనున్న ప్రభుత్వం?



ధరూరు మండలం సాగైన వరి పంట

ధరూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం సన్నరకం వరి పండించే రైతులకు ఖరీఫ్ సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 500 వరకు బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ఈ సీజన్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి తర్వాత స్థానంలో వరి ఉంది. జూరాల ప్రాజెక్టుతో పాటు ఎత్తిపోతల పథకాలు చెరువులు, బోరుబావుల కింద పెద్ద ఎత్తున రైతులు వరి సాగు చేశారు. సాగువిస్తీర్ణం దాదాపు 6. 50 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 17లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో 80 శాతానికిపైగా సన్నధాన్యమే ఉంటుంది. దసరా నుంచే కొనుగోళ్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వం కొత్త నిబంధన అమల్లోకి తేవటానికి కసరత్తు చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

కొలుస్తారట: చిన్నచిన్న వస్తువుల పొడవు, వెడల్పు కొలతలు లెక్కించటం కోసం వినియోగించే కాలిపర్స్ పరికరాన్ని సన్నధాన్యం గుర్తించేందుకు వినియోగించనున్నట్లు సమాచారం. ఇందుకు పౌరసరఫరాల శాఖ సంస్థ ఇప్పటికే భారీ సంఖ్యలో కాలిపర్స్ పరికరాల కొనుగోలుకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రతి కొనుగోలు కేంద్రానికి కనీసం రెండు చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కొలిచేదిలా: ధాన్యంలో పది గింజలను సేకరిస్తారు. ఒక ప్రత్యేక పరికరంలో వేసి వాటిపై పొట్టుపోయేలా చేస్తారు. తర్వాత వచ్చిన బియ్యపు గింజను కాలిపర్స్ ద్వారా కొలతేస్తారు. ఈ కొలతలో బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్లకన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు మిల్లీమీటరుకు మించొద్దు. బియ్యపు గింజ పొడవు, వెడల్పు నిష్పత్తి 2.5 మిల్లీమీటర్ల కన్నా ఎక్కువగా ఉండాలి. కాలిపర్స్‌లో పెట్టిన బియ్యపు గింజ ఈ కొలతలకు సరిపోతేనే దాన్ని సన్నధాన్యంగా పరిగణిస్తారు. అటువంటి వాటికే రూ. 500 బోనస్ చెల్లిస్తారు.

ఎగ్గొంటేదుకేనా: సన్నరకం ధాన్యలేవి అన్నదానిపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. బీపీటీ-5202తో పాటు ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలతో పాటు మరో 33 రకాలను సన్న ధాన్యంగా పరిగణించాలని సూచించింది. అయితే ఈ 37 రకాల్లో మన ఉమ్మడి జిల్లాలో పండించేది ఐదు నుంచి ఆరు రకాలుంటాయి. అలాంటప్పుడు ఈ కొలతలు దేనికని రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ శాఖ సన్నాల కింద ప్రకటించిన జాబితాలో రైతు పండించిన ధాన్యం ఉన్నా కొలతల్లో తేడా వస్తే దొడ్డు కింద పరిగణిస్తే ఎలాగని రైతులంటున్నారు. ఒక్కో వ్యవసాయ క్షేత్రంలో భూసారాన్ని బట్టి గింజ పరిమాణంలో తేడా ఉంటుందని రైతులంటున్నారు. కొలతల పేరుతో కొర్రీలు పెట్టి బోనస్ ఎగ్గొంటేందుకే ఈ కొత్త నిబంధన తెరపైకి వస్తోందని రైతులంటున్నారు.

పక్కరాష్ట్రంలో రేటెక్కువుంటే: ఇక ఉమ్మడి జిలాలో గద్వాల, నారాయణపేట వనపర్తి జిల్లాలకు సమీపంలో కర్ణాటక రాష్ట్రం రాయచూరు మార్కెట్ ఉంది. గతేడాది రూ. 3,300 వరకు క్వింటా సన్నరకం ధాన్యం ధర పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న బోనస్ కలిపినా పక్కరాష్ట్రంలో ఉన్న ధరకన్నా తక్కువే అవుతుంది. ఈ సారీ అదే ధర పలికితే రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే పరిస్థితి ఉండదు.

మార్గదర్శకాలు రాలేదు

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కేంద్రాల ఎంపిక పూర్తయింది. కేంద్రానికి వచ్చే ధాన్యం నాణ్యత తదితరాల పరిశీలనకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. వస్తే ఆ ప్రకారమే అమలు చేస్తాం.

-విమల, పౌరసరఫరాల అధికారిణి, జోగులాంబ జిల్లా

పేరుకే కమిటీ.. సమావేశాలు నిర్వహించరేమిటీ?

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి నిత్యం 750 చొప్పున సీజన్‌లో 900 వరకు రోగుల తాకిడి (ఓపీ) ఉంటుంది. సమస్యలు తిష్ఠ వేసినా.. పట్టించుకునే నాథుడే లేడు. అభివృద్ధి కమిటీని ఆగస్టు చివరి వారంలో ఏర్పాటు చేసినా.. ఇప్పటికీ ఒక్క సమావేశం నిర్వహించలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, జిల్లా మంత్రి గౌరవ అధ్యక్షులుగా, కలెక్టర్ ఛైర్మన్‌గా, ఎమ్మెల్యేలు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, జనరల్ ఆసుపత్రి వైద్యులు సభ్యులుగా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంది. కమిటీ సమావేశాలు లేక పర్యవేక్షణ కొరవడింది. ఆసుపత్రి నిర్వహణ అధ్వానంగా మారింది.

ఇష్టారీతిలో నియామకాలు..: జనరల్ ఆసుపత్రిలో ఒప్పంద పద్ధతిన వైద్య సిబ్బంది నియామకానికి కలెక్టర్ ఆమోదంతో ప్రకటన జారీ చేసి ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా భర్తీ చేయాలి. ఇటీవల అత్యవసర విభాగం (ఐసీయూ)లో ఆరుగురి నుంచి ముడుపులు తీసుకొని ఎలాంటి అనుమతులు లేకపోయినా.. ఆసుపత్రి అధికారుల సూచన మేరకు గుత్తేదారు భర్తీ చేశాడు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి పోవడంతో వారిని విధుల నుంచి తొలగించారు. ప్రస్తుతం వారికి ఆరు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. వేతనాలు చెల్లించాలని వారంతా ఆసుపత్రి పర్యవేక్షకునికి వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి కమిటీ పర్యవేక్షణ లేకపోవడం వలన వివిధ రకాల సామగ్రి కొనుగోలు పేరుతో కమిషన్లకు కక్కుర్తిపడి ఇష్టారీతిలో నిధులు ఖర్చులు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆసుపత్రిలో కొనసాగుతున్న క్యాంటీన్ నిర్వాహకుడు ప్రతి నెల సక్రమంగా రూ. 20 వేల చొప్పున అద్దె చెల్లించకపోయినా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పైపులైన్ లీకేజీతో ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద మురుగు నిల్వ

సమావేశంతో ప్రయోజనమిలా..: అభివృద్ధి కమిటీలో వివిధ రకాల అంశాలను చర్చించకపోవడం వలన ఆసుపత్రి నిర్వహణ గాడి తప్పుతోందన్న ఆరోపణలున్నాయి. ప్రతి మూడు నెలలకోసారి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించి ఆసుపత్రికి మంజూరైన నిధులు ఎన్ని? వాటిని ఎలా ఖర్చు చేశారు? వైద్యుల పనితీరు, సిబ్బంది సేవలు తదితరాంశాలను చర్చించడానికి వీలవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిలో నిధులు ఖర్చు చేస్తే చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

లీకేజీలతో అవస్థలు..


ఆసుపత్రిలో గతంలో నిర్మించిన మురుగునీటి పైపులైన్‌కు తరుచూ లీకేజీలు ఏర్పడటం వలన మురుగు ఆవరణలో నిల్వగా ఉంటోంది. తీవ్ర దుర్వాసన వస్తుండటంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగుల సహాయకులకు సరైన వసతులు లేకపోవడం వలన ఆరు బయటనే భోజనాలు చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో వరాహాలు సంచరిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం దసరా పండుగ తరువాత నిర్వహించడానికి చర్యలు తీసుకుంటాం. సమావేశం నిర్వహించడానికి సమయం కేటాయించాలని మంత్రి, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకపోయాం. నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నాం. ఆరుగురు వైద్య సిబ్బందికి వేతనాలు చెల్లించాలని గుత్తేదారునికి సూచించాం.

- డా. రఘు, జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకుడు

ముద్దబంతులు విరిసె.. బతుకమ్మ మురిసె!




బాలానగర్ మండలం గుండేడ్‌లో తోట

దేవరకద్ర మండలం గోప్లాపూర్‌లోని తోటలో నిలబడి చిత్రాలు దిగుతున్న ఓ కుటుంబం


ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలనే దేవతగా పూజించటం బతుకమ్మ పండగ ప్రత్యేకత. పల్లెల్లో బాలికలు నిత్యం వివిధ పూలతో బతుకమ్మలు తయారు చేసి సాయంత్రం వేళ ఆడిపాడుతున్నారు. ఈ పండగ వేళ ఉండే గిరాకీని దృష్టిలో పెట్టుకుని రైతులు ఇప్పటికే బంతి, ఇతర పూలతోటలు సాగు చేశారు. దేవరకద్ర మండలం గోప్లాపూర్, బాలానగర్ మండలం గుండేడ్ గ్రామాల్లోని రైతుల పూలతోటలు ఇలా విరగబూసి అందరికీ కనువిందు చేస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారు బంతితోటలోకి వెళ్లి చరవాణులతో చిత్రాలు దిగుతూ మురిసిపోతున్నారు. కాసేపు అక్కడే సేదతీరుతున్నారు. ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే, జడ్చర్ల గ్రామీణం

మనసు పెడితే.. లక్ష్య ఛేదన సాధ్యమే!



'పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్నీ సాధించలేం.'
-స్వామీ వివేకానంద



న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్: విజయాలు గాలి వాటంగా ఎప్పుడూ రావు. అదేదో సినిమాలో అన్నట్టు వంద కాదు.. రెండు వందల శాతం ప్రయత్నిస్తే ఏనుగు కుంభస్థలాన్నైనా కొట్టొచ్చు. సాధించాలనే తపన, అందుకు తగినట్లు శ్రమిస్తే విజయ తీరాలు వెతుక్కుంటూ మీ వద్దకే వస్తాయి. ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్ పరీక్షల్లో తప్పుతున్న వారి సంఖ్య రాష్ట్రంలోనే అధికంగా ఉంటోంది. ఇందుకు మనకు మనమే కారణం కాదా.. బోధనా లోపాలు, వసతులు లేవనే వాదనలు పక్కన పెట్టండి.. మన విజయానికి మనం చేస్తున్న కృషి ఎంతో ఆలోచించండి.. అప్పుడే ఇక రంగంలోకి దిగండి. విజయలక్ష్మి మిమ్మల్నెందుకు వరించదు. అది చదువైనా.. ఉద్యోగమైనా..

● నారాయణపేట జిల్లా కోస్గి పురపాలిక పరిధిలోని గుండ్లపల్లికి చెందిన సంతోష్ కుమార్ ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే అయిదు ఉద్యోగాలు సాధించాడు. నీటి పారుదల శాఖ ఏఈఈ, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకునిగా, పురపాలిక పట్టణ ప్రణాళిక అధికారిగా, పంచాయతీరాజ్ ఏఈతో పాటు, గ్రూప్-4కు ఎంపికయ్యారు.

● మల్దకల్ మండలం ఎల్కూరుకు చెందిన మహ్మద్ సుభాన్ మూడు ఉద్యోగాలు సాధించారు. వేర్వేరు గురుకులాల్లో రెండు అధ్యాపక పోస్టులకు ఎంపికయ్యారు. అలాగే పంచాయతీ కార్యదర్శిగానూ ఉన్నారు.

● కొల్లాపూర్‌లో చుక్కాయిపల్లికి చెందిన స్వప్న ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌ఏ విభాగంలో జిల్లా రెండో ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది.

● గత పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పాఠ్య పుస్తకం చదవడం అంశాల వారీ ప్రాధాన్యత తెలుసుకోవచ్చు.

● ఇతర వ్యాపకాలు తగ్గించి చదువుపైనే దృష్టి పెట్టాలి. సబ్జెక్టుల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.

● తెలుగులో అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా, వాక్య నిర్మాణం సరిగా ఉండేలా సాధన చేయాలి. చక్కటి దస్తూరీ ప్రధానం.

● హిందీ వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. నేర్చుకోవడం, ఇతర విద్యార్థులతో మాట్లాడుతూ ఉండటం ద్వారా పట్టు సాధించవచ్చు.

● ప్రణాళికా ప్రకారం ఇంగ్లిష్ గ్రామర్ నేర్చుకోవాలి. తోటి స్నేహితులతో వర్ధంచి లెటర్ రాయడం అలవాటు చేసుకోవాలి. అపరిచిత గద్యభాగాలపై సాధన చేయాలి.

● గణితంలో ప్రాథమిక భావనలు(కాన్సెప్ట్) బాగా నేర్చుకోవాలి. ప్రతి రోజూ రెండేసి లెక్కలు సాధనచేస్తేనే పరీక్షల నాటికి 500 నేర్చుకోవచ్చు.

● సాంఘిక శాస్త్రంలో మ్యాప్‌లను చూడటం, దేశాలు, రాష్ట్రాలను గుర్తిస్తూ నేర్చుకోవడం, చరిత్రను గుర్తుంచుకునేలా పుస్తకాలు చదవడం.

● సైన్స్ చిత్ర పటాలు బాగా నేర్చుకోవాలి. విద్యార్థులతో కలిసి చిత్రాలు వేయడం, సొంతంగా సాధన చేయాలి. ఇష్టమైన, సులభమైన పాఠ్యాంశాలను బాగా నేర్చుకోవాలి.

ఇప్పటి నుంచే: తరగతి ఏదైనా విద్యార్థి వారి సామర్థ్యంకు తగ్గట్టుగా రాణించడం ముఖ్యం. ఉమ్మడి జిల్లాలో గతేడాది పదో తరగతిలో 44,898 మంది పరీక్షలు రాస్తే, 5,575 మంది అనుత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 36 వేల మంది పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తే, 30 శాతానికిపైగా ఫెయిలయ్యారు. వీరు పరీక్ష తప్పడంలో ఇతర కారణాలతో పాటు స్వ తప్పిదాలు ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో రానున్న వార్షిక పరీక్షల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులు మనసు పెట్టి చదవాలి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంకా 5 నెలలకు పైగా సమయం ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదవగలిగితే విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా చేరుకోవచ్చు. జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయవచ్చు.



ఇలా చేయాలి

● నిరంతర అభ్యసనం ప్రధానం. దీని ద్వారా అనేక సమస్యలకు సమాధానాలు సొంతంగా తెలుసుకుంటారు.

● ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు, వాటిని నేర్చుకొని అమలు చేయాలి.



త్రికరణ శుద్ధితో చదవాలి: కొందరు విద్యార్థులు చేయాల్సింది చేయకపోవడం, అవసరం లేనిది చేస్తుండటంతో వెనుకబడిపోతున్నారు. ఇలా కాకుండా ప్రతి విద్యార్థి ఎందుకు చదవాలి? లక్ష్యం ఏమిటనేది తెలుసుకోవాలి. వారిలో ఎదగాలనే కోరిక ఉండాలి. ప్రతి విద్యార్థికి చదువు చిట్టచివరి లక్ష్యం కావాలి. త్రికరణ శుద్ధితో చదవాలి. అందుకు అనుగుణంగా శ్రమిస్తే రాణించడం పెద్ద కష్టమేమీకాదు. మూలాలపై శ్రద్ధ పెట్టి ముందుకెళితే తప్పకుండా విజయం సాధిస్తారు.

-డా.శ్రీనాథాచారి, వ్యక్తిత్వ వికాస నిపుణులు

సర్పాలన్నీ విషపూరితం కాదు

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : పరిసరాల్లో కన్పించే సర్పాలన్నీ విషపూరితమైనవి కాదని అందులో రెండు మాత్రమే విషపూరితమైనవని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సదాశివయ్య పేర్కొన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని మన్ననూరులో నిర్వహించిన పాముల ప్రదర్శనలో పాములపై అవగాహన కల్పించారు. పాములు పర్యావరణ పరిరక్షణలో పాములది కీలక పాత్ర అన్నారు. పంటలకు చేటు చేసే ఎలుకలు, చిన్న చిన్న జీవులను పాములు తింటాయన్నారు. మన పరిసరాల్లో ముఖ్యంగా 8 రకాల సర్పాలున్నాయని అందులో నాగుపాము, కట్లపాము మాత్రమే విషపూరతమైనవన్నారు. పాములను చంపకుండా వదిలేస్తే పొలాల్లోని ఎలుకలు, చిన్న కీటకాలను తిని జీవిస్తాయన్నారు. తమకు ప్రమాదం ఉందని భావించిన సందర్భంలోనే పాములు కాటేస్తాయన్నారు. వాటికి మనం ఏ హానీ తలపెట్టకపోతే అవి మనను ఏమి చేయవన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పాములను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రామమూర్తి, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు, చిన్నారులు పాల్గొన్నారు.



మన్ననూరులో పాములపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు సదాశివయ్య, ఎఫ్‌డీఓ రామమూర్తి

రూ.2.79 కోట్లతో అలంకరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాతను రూ. 2. 29 కోట్ల నగదుతో ధనలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు స్వచ్ఛందంగా అలంకరణకు నగదును సమర్పించారు. తెల్లవారుజామున ప్రారంభమైన అలంకరణ మధ్యాహ్నం 11. 30 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్య వైశ్య దంపతులు అష్టోత్తర నామావళి పారాయణం, కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు.



ఉమామహేశ్వరం ధర్మకర్తల మండలి నేడు ప్రమాణస్వీకారం

భోగ మహేశ్వరంలో ఏర్పాట్లు ● హాజరు కానున్న మంత్రి కొండా సురేఖ

అచ్చంపేట, న్యూస్‌టుడే : ప్రముఖ శైవ క్షేత్రం ఉమామహేశ్వర ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. మంత్రి హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయలు దేరి మధ్యాహ్నం 12.50 గంటలకు అచ్చంపేటలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉమామహేశ్వరం చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార సభలో పాల్గొని మాట్లాడనున్నారు. తరువాత అచ్చంపేటకు చేరుకొని మహాలక్ష్మి పథకం లబ్ధిదారుల సమావేశంలో పాల్గొననున్నారు.



నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వరం ఆలయం

● ధర్మకర్తల మండలి కొత్త పాలకవర్గంలో 14 మంది సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కొండ దిగువన భోగ మహేశ్వరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఛైర్మన్‌గా పులిజాలకు చెందిన బీరం మాధవరెడ్డిని నియమించారు. కొండపైకి రహదారి విస్తరణ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని మంత్రికి కొత్త పాలకవర్గం వినతిపత్రం అందజేయనుంది.

పట్టపగలే.. దొంగ దొంగ..!



వస్త్రాలను చిందర.. వందర వేసిన దృశ్యం(పాత)

న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

దొంగతనాలు అంటే చిమ్మ చీకట్లో జరిగేవి. ఒకప్పుడు ఏదైనా చోరీ జరిగినప్పుడు ఇది ఏ ముఠాపని అయి ఉంటుందో అన్న కోణంలో పోలీసులు విచారించేవారు. ఇటీవల కాలంలో పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం చోరీలు జరగడం పరిపాటిగా మారింది. మామూలు వ్యక్తులుగా సంచరిస్తూ, తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇరుగు,పొరుగు వారికి కూడా అనుమానం రాని రీతిలో తాళాలను కోసేసి గుంభనంగా పని కానిచ్చేస్తున్నారు. పట్టణాల్లో సాంకేతికత అందుబాటులోకి రావడంతో సులువుగా పట్టుబడతామని భావించి తెలివిగా గ్రామాలను అడ్డాగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్నవారి స్థితిగతులను ముందే అధ్యయనం చేస్తున్నారు.

● పల్లెల్లో సీసీ కెమెరాలు వంటి సాంకేతికత అందుబాటులో లేకపోవడం, జనం పనుల నిమిత్తం పొలాలకు వెళ్లడంతో పట్టపగలు వారి పని సులువు అవుతోంది. గతంలో జరిగే దొంగతనాలను చాలా వరకు చరవాణిల ఆధారంగానే కనుగొనే వారు. దొంగలు తెలివిగా చరవాణులను వెంట తీసుకురాకుండా ద్విచక్రవాహనాలపై గ్రామాలకు చేరుకొని తమ పని చేసుకొని ఉడాయిస్తున్నారు. చుట్టాల ఊరికి వచ్చినట్లు కలర్ ఇస్తూ ఎవరికీ అనుమానం రాని రీతిలో సంచరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.





కాచ్‌వార్ గ్రామంలో చోరీకి గురైన ఆభరణాల పెట్టెలు (పాత)

ఏం చేయాలి?

● పట్టపగలు తాళం వేసుకుని వెళ్లకుండా ఇంట్లో ఎవరినైనా ఉంచాలి. తప్పనిసరి వెళ్లాల్సివస్తే ఇరుగు, పొరుగువారిని అప్రమత్తం చేయాలి. ప్రస్తుత రోజుల్లో చరవాణి లేని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. ఇంట్లో ఏదైనా అలికిడి జరిగేటప్పుడు చరవాణికి సంకేతాలు వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి. మార్కెట్‌లో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

● విలువైన వస్తువులు, బంగారం వంటివి బయటకు వెళ్లేటప్పుడు తెలిసిన వారికి అప్పగించాలి.

● గ్రామంలో అపరిచితులు ఎవరైనా ప్రవేశిస్తే గట్టిగా ప్రశ్నించి నిర్ధారించుకోవాలి.



మచ్చుకు కొన్ని ఘటనలు

● మక్తల్ మండలం కాచ్‌వార్‌లో అశోక్ రెడ్డి ఇల్లు ఊరికి చివరన ఉండటం, తాళం వేసి ఉండటంతో పట్టపగలు చోరీ జరిగింది. కాట్రేవ్‌పల్లి, మంథన్‌గోడ్ గ్రామాల్లోనూ పట్టపగలు చోరీలు జరిగి నగదు, నగలు అపహరణకు గురయ్యాయి. ఊట్కూరు మండలం చిన్నపొర్లలోనూ పట్టపగలు నగదు, డబ్బులు దొంగతనం చేశారు. నారాయణపేట మండలం పెద్దజట్రంలో అదే రీతిలో జరిగింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేటలో ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లో ఏకంగా ఏటీఎం మిషన్‌ను గ్యాస్‌కట్టర్‌తో ధ్వంసం చేసి నగదు దోపిడీ చేశారు.

● ఇటీవల కోస్గి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు రుణం కట్టేందుకు పేట వచ్చారు. రూ.3లక్షలకు పైగా నగదు ఉన్న బ్యాగును కారులో ఉంచి రోడ్డుపై వాహనం నిలిపి బ్యాంకులోకి వెళ్లాడు. అప్పటికే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారును వెంబడించి అదును చూసి కారు అద్దాలు పగలగొట్టి అపహరించుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. సీసీ కెమెరాలో అంతా రికార్డు అయినా ఇంతవరకు దొంగలు దొరకలేదు.

● నారాయణపేట జిల్లాలో 97, మొత్తం ఉమ్మడి జిల్లాలో 550 వరకు చోరీ ఘటనలు జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగాయి. వాటిని విశ్లేషించినప్పుడు పట్టపగలు దొంగతనాలు ఎక్కువగా జరగడం పోలీసులను నివ్వెరపరుస్తోంది.


జోగులాంబకు ఏపీ ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న కర్నూల్ కలెక్టర్ రంజిత్ బాషా దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా కుటుంబ సమేతంగా జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈవో పురేందర్, అర్చకులు, ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం స్వామి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తుల రద్దీ: ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు.



భిన్నంగా నడపాలని..!

నేటితరం చిన్నారులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అధికంగా ఉంటోంది. వినూత్న ప్రయోగాలు చేసి అందరి దృష్టిని ఆకర్షించాలనే తపన వారిలో కనిపిస్తోంది. భూత్పూర్ మండలం ఎల్కిచర్ల గ్రామంలో ఓ బాలుడు తన సైకిల్ చక్రాలకు ఉన్న రెండు టైర్లను తొలగించాడు. కేవలం రిమ్‌లతోనే సైకిల్‌ను తొక్కుతూ ఇలా 'ఈనాడు' కెమెరాకు చిక్కాడు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదు

వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టుల ఎజెండా లేకపోతే దేశానికి భవిష్యత్తు లేదని, దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాలు, రాజ్యాంగాలకు రక్షణ లేదని, ఈ సమస్యలకు రక్షణగా నిలిచి దాని కోసం పోరాటం చేసేది ఒక్క కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సీపీఎం కార్యదర్శి జబ్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మీదేవమ్మ సంస్మరణ సభలో మాజీ ఎంపీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, మాజీ ఎంపీ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డిలతో కలిసి తమ్మినేని వీరభద్రం లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో మూడోసారి మతోన్మాద వ్యక్తుల చేతుల్లో పాలన సాగుతుందని, ఆర్థిక సంపద అంతా అదానీ, అంబానీలకు పంచి పెడుతున్నారన్నారు. రైతు రుణమాఫీలో ఇంకా 18 లక్షల మందికి రూ.17 వేల కోట్లు బ్యాంకులో వేయాల్సి ఉందని, దాని కోసం రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. భాగ్యనగరంలో ఆక్రమించిన చెరువుల కాల్వలను వాటిని పునరుద్ధరించాలన్నా పేరుతో ప్రభుత్వం హైడ్రా పేరిట కూల్చివేతలు ప్రారంభించిందని, దీనిని సీపీఎం పార్టీ వ్యతిరేకించడం లేదని కానీ, పేదల జోలికి వస్తే మాత్రం పూర్తిగా ఖండిస్తామన్నారు. నల్లగొండ జిల్లా వెంట ప్రవహించే మూసి నీటితోనే పొలాలు పండించే పరిస్థితి ఆయా ప్రాంతాల్లో ఉందని వీటి పై దృష్టి పెట్టకుండా సుందరీకరణ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజాహితం కోరుతూ ప్రజల తరపున పోరాటానికి మనం చేయాల్సిన పని చేయాల్సిందేనని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీపీఐ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, విజయరాములు, అర్జున్, పుట్ట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్వ, న్యూస్‌టుడే : లంకాల గ్రామానికి చెందిన దుప్పల్లి శ్రీనివాసులు, అతని కుమారుడు రాముతో కలిసి ఆదివారం ద్విచక్ర వాహనంపై రాంపూర్ గేటు నుంచి సొంతూరు లంకాల వస్తున్నారు. లంకాల చెరువుకట్ట దాటిన తర్వాత మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని పటాన్‌చెరుకు చెందిన బులేరో వాహనం ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ కిందపడి క్షతగాత్రులయ్యారు. శ్రీనివాసులు(45) తలకు బలమైన గాయాలై రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందారు. రాము కుడికాలుకు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమయ్య తెలిపారు.

కారు బోల్తాతో మరొకరు..

ఇటిక్యాల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి పక్కకు కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు ఎర్రవల్లిచౌరస్తా సమీపంలోని విజయవర్ధిని ఆయిల్ మిల్లు ఎదురుగా అదుపుతప్పి జాతీయ రహదారి పక్కకు బోల్తాపడింది. దీంతో స్వయంగా కారు నడుపుకుంటూ వెళ్తున్న కర్నూలులోని శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(60) అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఆయన ఒక్కరే ఉన్నారు. కర్నూలు జిల్లా పంచలింగాల సమీపంలోని ఆల్కాలిస్ పరిశ్రమలో పనిచేస్తున్నట్లుగా స్థానికులు గుర్తించారు.

రోడ్డు ప్రమాద మృతుడు ఛత్తీస్‌గఢ్ కూలీ

గాయపడిన మరొకరి పరిస్థితి విషమం

జడ్చర్ల, న్యూస్‌టుడే : జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలోని ఫ్లైఓవర్‌పై శనివారం అర్ధరాత్రి తర్వాత 1.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన విషయం 'ఈనాడు' పాఠకులకు విదితమే. వారిని ఛత్తీస్‌గఢ్ కూలీలుగా పోలీసులు గుర్తించారు. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ముర్వ(54), కాలురాం రెండు వారాల క్రితం బతుకుదెరువు కోసం జడ్చర్లకు వచ్చారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం సమీపంలోని ఇటుక బట్టీలో కూలీగా పని చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నారు. ఆ ఇద్దరూ కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వచ్చారు. జాతీయ రహదారి-44పై ఫ్లైవర్ మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొట్టింది. ముర్వ అక్కడికక్కడే మృతిచెందగా కాలురాం తీవ్రంగా గాయపడ్డాడు. కాలురాంను హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉంది. ముర్వ కుమారుడు రాంనారాయణ్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

మేమున్నాం.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మీకు తోడుగా..

నాగర్‌కర్నూలు	7993300530
అచ్చంపేట	8008573927
కల్వకుర్తి	9908803650
కొల్లాపూర్	8008573870

కందనూలు, న్యూస్‌టుడే

? నాగర్‌కర్నూల్ పట్టణంలోని రాంనగర్‌కాలనీలో కొన్ని రోజులుగా మురుగుకాల్వలు శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వస్తోంది.
- శ్రీనివాసులు, నాగర్‌కర్నూల్

✔ పారిశుద్ధ్య సిబ్బందితో వెంటనే కాల్వలు శుభ్రం చేయిస్తాం. - నరేశ్‌బాబు, పురపాలక సంఘం కమిషనర్, నాగర్‌కర్నూల్

కొల్లాపూర్, న్యూస్‌టుడే

? కొల్లాపూర్-చౌటబెట్ల రహదారి, రామాపురం దారి కంకరతేలి గుంతలు పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
- జగదీశ్, చౌటబెట్ల

✔ దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతాం.
- సాయిరాం, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, కొల్లాపూర్

అతిథి గృహం మంజూరయ్యేనా?



అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిన వెల్దండ తహసీల్దార్ కార్యాలయ భవనం

కల్వకుర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వెల్దండ మండలంలో రెవెన్యూ అతిథి గృహ నిర్మాణం హామీలకే పరిమితమైంది. తొలిసారిగా మండల పర్యటనకు వస్తున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపనకు సోమవారం రానున్న మంత్రి కొత్త అతిథి గృహాన్ని మంజూరు చేస్తారని ఆశిస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న వెల్దండ మండల కేంద్రంలో ఏఒక్క విభాగానికి అతిథి గృహమంటూ లేదు. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారితో పాటు జిల్లా ముఖద్వారం కావడంతో వెల్దండ మీదుగా తరచూ మంత్రులు, ఎమ్మెల్యేలు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా విశ్రాంతి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సమావేశాలు, ప్రెస్‌మీట్లు నిర్వహించేందుకు నిరుపయోగంగా ఉన్న బస్టాండ్, దేవాలయం, స్థానిక నాయకుల ఇళ్లను ఎంపీడీవో కార్యాలయాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది. అయినా అతిథి గృహ నిర్మాణ విషయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఎవరూ చొరవ చూపడం లేదు.

● కల్వకుర్తి నియోజక పరిధిలోని ఆమనగల్లు మండలం ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో కొనసాగుతోంది. అక్కడి అటవీశాఖ అతిథి గృహాన్ని రెండు దశాబ్దాల క్రితం మావోయిస్టులు పేల్చివేశారు. ఈ క్రమంలో 2017 డిసెంబర్ 12న వెల్దండ తహసీల్దార్ కార్యాలయ ప్రారంభానికి వచ్చిన అప్పటి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు జాతీయ రహదారిపై వెల్దండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో లేదా, కార్యాలయ పైభాగంలో రెవెన్యూ అతిథి గృహాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి వెల్దండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ అతిథి గృహం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సినిమా చిత్రీకరణకు సోమశిల అనుకూలం



క్లాప్ కొడుతున్న కొల్లాపూర్ పురఛైర్ పర్సన్ రమ్యకుమారి

కొల్లాపూర్, న్యూస్‌టుడే : నల్లమల అడవిలో, కృష్ణాతీరాన గల సోమశిల ప్రాంతం సినిమాల చిత్రీకరణకు అనుకూలమని కొల్లాపూర్ పురపాలిక ఛైర్‌పర్సన్ మేకల రమ్యకుమారి చెప్పారు. ఇప్పటికే పర్యాటక పరంగా జాతీయ స్థాయిలో అవార్డు వచ్చిందన్నారు. ఆదివారం సోమశిలలో శివగాడు యమాస్పీడు సినిమా షూటింగ్‌ను ఆమె క్లాప్‌కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సింహ్మారావు, షేక్‌రహీంపాష, కాంగ్రెస్ నాయకులు నాగరాజు, వివిధ ప్రాంతాల నటీనటులతో పాటు స్థానిక కళాకారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు సహకరించాలి

తెలకపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలున్నవారు 2020లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేశారని వారంతా ఈ నెల 7 నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని ప్రత్యేకాధికారి, ఎంపీవో లింగయ్య కోరారు. ఇళ్ల స్థలాలకు సంబంధించిన దస్త్రాలు తీసుకొచ్చి క్రమబద్ధీకరణ కోసం సహకరించాలన్నారు. దాదాపు 750 మంది వరకు అభ్యర్థులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

మంత్రి పర్యటన విజయవంతం చేయాలి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం కల్వకుర్తి నియోజకవర్గంలో మంత్రి మొత్తం రూ.43.42 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు ప్రారంభించనుండటంతో పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలి రావాలన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో తహసీల్దారు కార్యాలయం ప్రారంభించిన అనంతరం కాటమయ్య కిట్లు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేస్తారన్నారు. అనంతరం వెల్దండ మండల కేంద్రంలో గురుకుల విద్యాలయం అదనపు గదుల ప్రారంభోత్సవంతో పాటు నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. కల్వకుర్తి పట్టణంలో జేబీఎస్ కళాశాల భవనానికి భూమిపూజ, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, సీసీ దారుల నిర్మాణానికి భూమిపూజ, మినీ స్టేడియంలో రూ.1.90 కోట్లతో మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచి ఆనంద్‌కుమార్, నాయకులు సాయిచరణ్‌రెడ్డి, [illegible], భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యం చేస్తే చర్యలు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ నియోజకవర్గంలోని దుర్గామాత విగ్రహాల వద్ద, ఊరేగింపులకు డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రాజా ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. అందరూ సహకరించాలన్నారు. సీఐ మహేశ్, ఎస్సైలు హృషికేశ్, రామన్‌గౌడ్, సతీశ్ పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొల్లాపూర్, న్యూస్‌టుడే : మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కొల్లాపూర్ పురపాలిక ఛైర్‌పర్సన్ మేకల రమ్యకుమారి అన్నారు. ఆదివారం పురపాలిక పరిధిలోని నర్సింగాపురంపల్లిలో రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తాం

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి వివిధ రకాల పథకాలు అమలు చేసి ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తామని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 12 వార్డులో ఆదివారం ఆకాశ దీపాలను ప్రారంభించి మాట్లాడారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలకు సంబంధించి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పురపాలక కౌన్సిలర్లు మోతికూమార్, రాజు, నాయకులు హబీబ్, దర్శ రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుక



నవరాత్రి ఉత్సవాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పద్మశాలి మహిళా సంఘం ప్రతినిధులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అచ్చంపేటలో పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాటలు పాడుతూ మహిళలు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గీత, హైమావతి, నిర్మల, కల్యాణి, ప్రశాంతి, రాజేశ్వరి, బాలకిష్టమ్మ, జంగమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.







కోడేరు : గంట్రావుపల్లిలో భక్తుల పూజలు.. ఊర్కొండ : బొమ్మరాసిపల్లిలో.. నాగర్‌కర్నూల్ : వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేసిన సీనియర్ సివిల్ న్యాయమూర్తి సబిత, జూనియర్ సివిల్ న్యాయమూర్తి మౌనిక దంపతులు.. అచ్చంపేట : లలిత త్రిపుర సుందరీదేవికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు

దుష్ట సంహారిణి.. దుర్గా రూపిణి

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 4వ రోజు ఆదివారం అమ్మవారిని లలిత త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల వద్ద అన్నదానం కొనసాగింది.

- న్యూస్‌టుడే, బృందం





ఉమామహేశ్వర క్షేత్రంలో కూష్మాండ దేవి అలంకారంలో అమ్మవారు.. నాగర్‌కర్నూల్‌లోని ఈశ్వర్ కాలనీలో.. అమ్రాబాద్‌లో లలితాదేవి రూపంలో అమ్మవారిని పూజిస్తున్న భక్తులు




లింగాల: అంబటిపల్లిలో.. కల్వకుర్తి: రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో..

ఆరోగ్య భద్రతపై భరోసానివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వ ఉత్తర్వులతో కూడిన భరోసానివ్వాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆహారం, వాతావరణ పరిస్థితుల కారణంగా జర్నలిస్టులకు గుండె, కాలేయం, శ్వాసకోశ వ్యాధులతో తరచుగా అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు రూ.10 లక్షలతో వెంటనే ఆరోగ్య భద్రతను కల్పించాలన్నారు. క్షేత్ర స్థాయిలో అర్హతను బట్టి ఇల్లు, ఇంటి స్థలాన్ని కేటాయించాలని పేర్కొన్నారు. జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అక్టోబర్ చివరలో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించనున్న జర్నలిస్టుల సమ్మేళనంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు. నాయకులు మధుగౌడ్, వెంకట్‌రెడ్డి, రాములు, కర్ణయ్య, సుదర్శన్‌రెడ్డి, శ్రీదర్, సాయిబాబు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ చెక్‌పోస్టులను ఎత్తివేసేలా పోరాటం

అచ్చంపేట, న్యూస్‌టుడే : నల్లమల అటవీ ప్రాంతంలోని ఉమామహేశ్వరం, మద్దిమడుగు దేవాలయాలకు వెళ్లే మార్గంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్రమ చెక్‌పోస్టులను ఎత్తివేసే వరకు పోరాటం చేస్తామని శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందూ దేవాలయాలకు వెళ్లే భక్తుల నుంచి అటవీ అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖల మంత్రి కొండా సురేఖ సోమవారం ఉమామహేశ్వరం పర్యటనకు వస్తున్న సందర్భంగా వినతి పత్రం అందజేయనున్నామని పేర్కొన్నారు. చెక్‌పోస్టులను ఎత్తివేయకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉద్ధృతం చేస్తామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ విపక్షంలో ఉన్నప్పుడు అక్రమ చెక్‌పోస్టులను ఎత్తి వేయాలని గళమెత్తారని, అధికారంలోకి వచ్చిన తరువాత భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు కోర్టు సమన్లు

వచ్చేనెల 19న హాజరువాలని సూచన

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమం సకల జనుల సమ్మె నేపథ్యంలో బస్సులను అడ్డుకున్నారన్న అభియోగంతో 28 మంది ఉద్యోగులకు కోర్టు నుంచి సమన్లు అందాయి. మలిదశ ఉద్యమం సకల జనుల సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని బస్సులు రోడ్డు మీదకు రాకుండా అడ్డుకున్నారు. అప్పట్లో ఆర్టీసీ టీఎంయూ సంఘం నాయకులు నిర్వహించిన ధర్నాలో ఐకాస ఉమ్మడి జిల్లా సమన్వయకర్తగా ఉన్న చంద్రానాయక్‌తో పాటు మరో 27 మందిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో నలుగురు మహిళా ఉద్యోగినులు కూడా ఉన్నారు. 2024 నవంబర్ 19న రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ద్వారా మహబూబ్‌నగర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుకావాలని సమన్లు అందాయి. 13 ఏళ్ల క్రితం ఉద్యమం సందర్భంగా కేసులు నమోదయ్యాయని, వాటిని కొట్టివేశారని అనుకున్న దశలో కోర్టుకు హాజరుకావాలని సమన్లు వచ్చాయని చంద్రానాయక్ ఆవేదన వ్యక్తంచేశారు.

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : దేవర, రమణ : స్వాగ్
కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర, అశోక్ : స్వాగ్

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



టమాటా 70, వంకాయ 45, బెండ 48, మిరప 60, కాకర 70, బీర 65, క్యాలిఫ్లవర్ 70, క్యాబేజీ 50, క్యారెట్ 65, దొండ 50, ఆలుగడ్డ 45, ఉల్లిగడ్డ 60, గోకర 70, దోస 45, ఆనంకాయ 18, చిక్కుడు 65, మునగకాయ 70, బీట్‌రూట్ 50, ఖీర, 40, బీన్స్ 95.

- న్యూస్‌టుడే, కందనూలు

తితిదే ఆధ్వర్యంలో గీతాకంఠస్థ పోటీలు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : డిసెంబరు 11న గీతా జయంతిని పురస్కరించుకుని తితిదే, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు తితిదే కార్యక్రమ ఉమ్మడి జిల్లా అధికారి డా. ఉత్తరపల్లి రామాచారి వెల్లడించారు. భగవద్గీతలోని 6వ అధ్యాయంలో శ్లోకాలు పఠించాల్సి ఉంటుందన్నారు. 6, 7, అలాగే 8, 9 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గీతలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలు వచ్చిన 18 ఏళ్ల పైబడిన వారికి కూడా వేరుగా పోటీలుంటాయన్నారు. నవంబరు 30న ఉదయం 10 గంటలకు వనపర్తి జిల్లాకు సంబంధించి అక్కడి సరస్వతి శిశుమందిర్‌లో, నారాయణపేట జిల్లాస్థాయి పోటీలను డిసెంబరు 1న మరికల్‌లోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో, నాగర్‌కర్నూల్ జిల్లాస్థాయి పోటీలు డిసెంబరు 4న కల్వకుర్తిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో, జోగులాంబ గద్వాల జిల్లాస్థాయి పోటీలను డిసెంబరు 7న గంజిపేటలోని శ్రీసరస్వతి టాలెంట్ హైస్కూల్‌లో, డిసెంబరు 10న మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి పోటీలను జిల్లాకేంద్రంలోని తితిదే కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల అనంతరం అదేరోజు విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. వివరాలకు 93475 40005, 73967 11574 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్

కోడేరు, న్యూస్‌టుడే : ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్లు చేసే మోసాలపై రైతులు, యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎత్తం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్లు చేస్తే స్పందించవద్దన్నారు. ఎట్టిపరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దన్నారు. యువత మత్తు పదార్థాలు, మద్యానికి బానిసలుగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ సీఐ మహేశ్, ఎస్సై గోకారి, మాజీ సర్పంచి వరలక్ష్మి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రావు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు... మురుగుకు నిలయం



పెంట్లవెల్లిలోని 7వ వార్డులో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు ఇది. గ్రామంలోని నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు, పిచ్చి మొక్కలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఫలితంగా దోమలు వ్యాపించి విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, పెంట్లవెల్లి

మినీ మైదానంలో వసతుల కరవు



కొల్లాపూర్ మినీ స్టేడియంలో సరైన వసతులు లేవు. వ్యాయామాలకు, క్రీడాకారులకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఓపెన్ జిమ్ సామగ్రి దెబ్బతినగా.. ఈత కొలను పనులు అసంపూర్తిగా ఉన్నాయి. శనివారం విద్యార్థులు పాత టైరు పైనుంచి దూకుతూ సాధన చేశారు. సమస్యలపై పురపాలిక కమిషనర్ శ్రీనివాసన్ స్పందిస్తూ... జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

- న్యూస్‌టుడే, కొల్లాపూర్

ఉపకేంద్రంలో పరికరాల చోరీ

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : మండలంలోని మరికల్ శివారులోని 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. కేంద్రం ఆవరణలో ఉన్న పరికరాలను (ఐసోలేటెడ్ కాపర్ రాడ్స్) గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఉదయం గుర్తించిన కేంద్రం ఏఈ లిల్లీరోజ్ తిమ్మాజిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరికరాల విలువ రూ.లక్ష వరకు ఉంటుందని ఉపకేంద్రం అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని వెల్గొండ గ్రామ గేటు వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. వెల్గొండకు చెందిన భాస్కర్, రషీద్ ఆటోలో సుమారు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడేరు, న్యూస్‌టుడే : మండలంలోని ఎత్తం నుంచి కోడేరుకు రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోకారి ఆదివారం తెలిపారు. ఎత్తంలో లబ్ధిదారుల నుంచి విక్రయాలు చేసి కోడేరుకు చెందిన మానసపాడు రమేశ్ తన ఆటోలో 5.5 కింటాళ్ల బియ్యం తరలిస్తున్నారు. అదే సమయంలో పోలీసులకు మాలగట్టు సమీపంలో తారసపడగా పట్టుకొని ఠాణాకు తరలించి సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్లు స్వాధీనం

ఊర్కొండ, న్యూస్‌టుడే : అనుమతులు లేకుండా హనుమాన్ గుట్టపై రాతి కడీలు, రాళ్లను తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి సీఐ నాగార్జున హెచ్చరించారు. ఆదివారం ఊర్కొండపేట గ్రామ శివారు హనుమాన్‌గుట్ట, బెల్లంగుట్ట నుంచి అక్రమంగా రాతి కడీలను తరలిస్తున్న 3 ట్రాక్టర్‌లను పట్టుకొని ఠాణాకు తరలించారు. ప్రతిష్ఠాత్మకమైన ఆలయ పరిసరాల్లో ఉన్న గుట్టలపై, మిషన్ భగీరథ ట్యాంకుల వద్ద ఎలాంటి పనులను చేపట్టరాదని హెచ్చరించారు. ఎస్సై వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : కేఎల్ఐ కాలువలో ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీటమునిగి గల్లంతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సల్కర్‌పేట గ్రామానికి చెందిన మేఘస్వామి (26) ఆదివారం తన పొలం వద్దకు వెళ్లి, మధ్యాహ్నం సమీపంలోని కేఎల్ఐ కాలువలో ఈతకు దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యులు కుమారుడు ఇంటికి రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లి చూడగా, కేఎల్ఐ కాలువ వద్ద యువకుడి దుస్తులు గమనించి నీటిలో గల్లంతైనట్లు గుర్తించారు. సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం.. సుఖాంతం

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మారుతీనగర్ కాలనీకి చెందిన మతిస్థిమితం లేని యువకుడు హరీశ్ కుటుంబ సభ్యులతో కలిసి అంబేడ్కర్ కూడలి సమీపంలోని ఓ దుకాణానికి వెళ్లారు. దుకాణం నుంచి ముందుగా బయటకు వచ్చిన హరీశ్ అదృశ్యమయ్యాడు. సమాచారం అందుకున్న సీఐ రవీందర్ యువకుడి వద్ద ఉన్న చరవాణి సిగ్నల్ (లోకేషన్) ఆధారంగా బల్మూర్ మండలం మహదేవ్‌పూర్ గేటు వద్ద ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై ఇందిర పాల్గొన్నారు.

మోసం చేశారని ఫిర్యాదు

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : పొలాన్ని అమ్మకానికి చూపి ముందస్తుగా రూ.5 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వని వ్యక్తులపై తిమ్మాజిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలానికి చెందిన మధ్యవర్తులు భాస్కర్‌గౌడ్, మాధవులు, యాదగిరి కలిసి బావాజీపల్లి శివారులో 1.28 ఎకరాల పొలం ఉందంటూ హైదరాబాద్‌కు చెందిన అజయ్‌గౌడ్ వద్ద ముందస్తుగా డబ్బు తీసుకున్నారు. ఏడాది గడిచినా భూమి రిజిస్ట్రేషన్ చేయకపోగా అడ్వాన్సు కూడా తిరిగి ఇవ్వలేదు. బాధితుడు అజయ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం




వెల్దండలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.. నాగర్‌కర్నూల్ : ఉపాధ్యాయులతో విద్యార్థులు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: వెల్దండ మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్‌లో 1995-96 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకొన్నారు. అప్పటి ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, గోసులరాములు, నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాఘరాములును ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనువాసులు, లింగం, లక్ష్మయ్య, నవీన్, రామకృష్ణ, రామేశ్వర్‌సింగ్, మేరాజ్, సైదులు, స్వప్న, కవిత, మంజుల, సరిత, రోజా, బాలమణి, అమీరాబేగం పాల్గొన్నారు.

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీవాణి విద్యాలయంలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పట్టణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

పెంట్లవెల్లి , న్యూస్‌టుడే : పెంట్లవెల్లి మండలంలోని జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో 1997-98 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెండు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం వారికి పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు రామస్వామి, వెంకటురెడ్డి, పూర్వ విద్యార్థులు , విజయ్, గోవు రాజు, రాముడు, రమణ, విష్ణు, శేషు, కురుమయ్య, ఏకలవ్య, పాల్గొన్నారు.